# నీళ్ళపాలు

సుంకర సూర్యనారాయణ

"పాలల్లో నీళ్ళుపోసినా, నీళ్ళల్లో పాలు పోసినా ఒకటే" అన్నాడు రాము.

అందరు పక్కున నవ్వారు. రామునకు కోపంవచ్చి జేవురించినకళ్ళతో "కాదేం" అన్నాడు.

"అవును లే...!" అని వ్యంగ్యంగా అనేసి సీరియస్ గా ముఖం పెట్టేసి కూర్చున్నాడు కేశవ.

"కాని..." అని చిరునవ్వు ఆపుకోలేక అన్నాడో లేదో కేశవ, "యేం" అన్నాడు. రాము తెలివితక్కువతనం బయటపెట్టడం కోసం ఏమీ తెలియనివాడిలా కేశవ "యేం" అన్నాడని అందరూ గ్రహించారు.

"నీళ్ళల్లో పాలు పోయటమంటే పాలవాటా తక్కువ, పాలల్లో, నీళ్లు పోయటమంటే నీళ్ళవాటా తక్కువ." కేశవ దీర్ఘం తీస్తూ అన్నాడు. రామూ అవమానం పట్టలేక తోక త్రొక్కిన త్రాచులాగ బుసలు కొట్టసాగాడు.

అవమానం, ఆగ్రహం మిళితమై అతని ముఖం వివర్ణమైంది. అగాధంలో మునిగిపోతూ బ్రతుకాలనేఆశతో విధితో పెనుగులాడే మానవునిలా బాధపడ్డాడు. తిరిగి ఉండబట్టలేక కాటువేసేటట్టు ఇలా అనేశాడు.

"మనమిట్లా ఉండబట్టే మన నాయకులట్లాఉన్నారు. ఆంధ్రనాయకులు హైదరాబాదు ఆంధ్రనాయకులపై సవారీచేయాలని, హైదరాబాదు ఆంధ్రనాయకులు ఈ ఆంధ్రనాయకులపై సవారిచేయాలని ఎత్తులువేస్తున్నారు. అయితే ఒకరిజుట్టు ఒకరికి అందేట్లుగాలేదు. మనము హైద్రాబాదు తెలుగు ప్రాంతాన్ని ఆంధ్రలో కలిపి విశాలాంధ్ర కావాలంటున్నాము. ఇది సమంజసమైన వాదమైనా, దీన్ని వ్యతిరేకించేవారు లేకపోలేదు. ఆంధ్రలో హైద్రాబాదు తెలుగు ప్రాంతాన్ని కలిపితే నీళ్ళల్లో పాలు కలిపినట్లేననీ, ఆంధ్రులు హైద్రాబాదీయులపై సవారి చేస్తారనీ, ముస్లిములకు వారి భాషకు, మతానికి గొడ్డలిపెట్టనీ మూర్ఖవాదనలు లేవదీశారు. మరి కొంతమంది 'మేము ఆంధ్రలో కలవము, ఆంధ్రులనే మాలో కలవమనండి' అన్నారు. ఇది మరీ మన్యప్రాంతీయులలో కొంతమంది వాదన. ఇది వింటే నవ్వు, తలకాయ నొప్పి రెండూ వస్తాయి."

మళ్ళీ యీ విధంగా మొదలుపెట్టాడు రాము.

"ఆంధ్రను హైద్రాబాదులో కలిపినా, హైద్రాబాదును ఆంధ్రలో కలిపినా తేడా లేదని నా వుద్దేశ్యం. అయితే ఆర్థికచిక్కులు కొన్నివున్నాయి. 'ఫజలాలీకమీషను' బెజవాడ వచ్చినపుడు కళా వెంకట్రావు, కాశేశ్వరరావు ప్రభృతులు ఒక నివేదిక సమర్పించారు. అందులో హైద్రాబాదుకు ఎట్టి నష్టమూరాకుండా ముందు కట్టుబాట్లు చేసుకోవచ్చని సూచించారు."

"ఇంకో శ్రీబాగ్ పాక్టు అన్నమాట" అన్నాడు కేశవ.

"హై—"

"ఆఁ. నా దొక్క మనవి"

"ఏమిటి" సీరియస్ గా అన్నాడు రాము.

"పాలల్లో నీళ్ళుపోసినా, నీళ్ళల్లో పాలుపోసినా ఫలితమేమిటి?"

"నీళ్ళపాలు"

"అదే నే చెప్పబోయేది. నామమాత్రానికి తగువులెందుకని. ఆంధ్రను హైద్రాబాదును కలిపి 'విశాల హైద్రాబాదు' అని పేరు పెట్టమంటున్నారు కొందరు మహాత్ములు!"

"ఇది మరీ వింతవాదం!" అని ముక్కుమీద వేలేసుకున్నాడు శంకరం.

ఆలోచనతో చెప్పినట్లుగా కన్నులు చిన్నవి చేసి "మీకు కోపంరాకుండా వుంటే ఒక్కటి మనవిచేస్తాను" అని కేశవ అనేటప్పటికి 'క్యూరియస్' గా "ఏమిటి" అన్నాడు రాము.

"ఎవ్వరికీ తగాదా లేకుండా ఆంధ్ర హైద్రాబాదులను కలిపి 'ఆంద్రాబాద్' అని నామకరణం చేస్తే?"

అంతా నవ్వారు. "జిందాబాద్" అనేశారు ఏకకంఠంతో. ★


